# వీధి నాటకం

'అనూరాధ'

అబ్బ! ఏం ఎండా - దీ నమ్మకడుపుకాలా -, ఏం మాడ్చేస్తోందీ! విధిలేక బజారుపోయి యింటి కొస్తున్నాను.

కిందకాళ్లూ పైన కళ్లూమండుతూన్నా, ఎల్లాగో అల్లా పళ్లబిగిని యింటి కొస్తూన్నాను.

ఏమరుపాటుగా ఉండగా, కాషేసి, వెన్నంటి ఉరికింది మోటారుకారు.

- ఉక్కిరిబిక్కిరై, దారి తప్పుకుంటూన్నాను.

నా మొహాన, రోడ్డంటా యింతదుమ్మెత్తి, ముందేమిటో ముంచుకు పోతున్నట్లు - తనదారిన తాను తుర్రుమంది మోటారు!

ఏం పాపం, ఏంఖర్మం చేశానని నన్ను ముందు బెదరగొట్టాలీ-? దారి తప్పుకుంటూన్నా, వైదొలగుతూన్నా, నా మొహాన దుమ్మెత్తాలీ-? చెప్పండి.

ఈ వున్నవాళ్లతో యిదే చిక్కు. వాళ్లు మన ముందున్నా - వెనక్కెళ్లినా, మనప్రాణాలు నిలూనా తోడందే పోరు!

... ... ...

వైష్ణవకవుల ఉజ్జ్వలమధుర భావనలకు తల లూచి, గాంధీ రవీంద్రుల భావ-వ్యాఖ్యాన పరంపరలకు నాతలను రేడియోస్టేషన్ చేసి కాలం గడుపుకుంటూ వొస్తున్నాను. పెళ్లామూ బిడ్డలూ మలమలమాడుతూంటే - 'సఖిపతంగ సుతాపులినాటవీ..." అంటూండడం భావ్యం కాదని పిస్తోంది.

అ-బ్బ-! ఎండ మండిపోతోంది! ఏంఎండ...! తలుపెవరో దడదడా పగలగొడుతున్నారు. ఎవరో...? 'వొస్తున్నా ఉండండి. వొసేయ్! ఎవరో తలుపుకొడుతున్నారు కాస్త వెళ్లితియ్యి. ఊఁ? లే! వొస్తున్నా వుండండి...'

(అపర్ణవెళ్లి తలుపుతీసింది. అపర్ణ మా ఆవిడ పేరు...) —

ప్రసాదరావు!

'రావోయ్' రా! అదేమిటీ - అట్లా వున్నావ్? ప్రసాదరావు చెమటలు కారుతూ, రొజుకుంటూ, వొచ్చాడు. డస్సివున్నాడు. కళ్లల్లోవున్నై ప్రాణాలు.

" . . . . . "

"కాళ్లు కడుక్కో, సహం తగ్గుతుంది"

"కాళ్లే కాదోయ్ - ళ్లూ కడగాలి! వెధవ దుమ్ము".

అపర్ణ కాళ్లుకడుక్కో ఉప్పునీళ్లూ, తాగ మంచి నీళ్లూ తెచ్చి యిచ్చింది: కాసిని మంచినీళ్లు తాగి, అమ్మయ్య అని ఈజీచెయిరులో నొరిగాడు అతను.

"ఏమోయి! యింత ఎండలో వొచ్చావు! వడ తగిల్తే?"

"రేపటికి రెండూ."

"ఛీ! అఘాయిత్యం మాటలు అనకూడదు!"

"ఎన్నైతేనేం-నాయనా...మీరు కవులు... చకోరపక్షి, యింత వెన్నెలా వుంటే చాలు. ఆటలూ-పాటలూ పాడుతూ ఆడుతూ వుంటారు."

- పొడిచినట్లైంది. (కొత్తరకం నాటకాలు రాయమనీ, అవి ఆడాలనీ, ఆడి దేశంలో సంచలనం చెయ్యాలనీ, ప్రసాదరావు నేను పారడీలు రాస్తున్న నాటి నుంచీ పోరుతున్నాడు. ప్రసాదరావు నటుడూ-కవితాప్రియుడూ; చదరంగంమీద కాశిని పద్యాలు రాశి తాను కవిని కానని తేల్చుకున్నాడు. Bank వొదలగానే చదరంగం సామానో, చక్కనికవిత్వమో ఏదో వొకటి వుండాలి అతనికి.—

ఏడవలేక నవ్వాను. "నవ్వుతావ్ నాయ్నా; నీ కేం మహారాజువి. కవీశ్వరుడివి"

"చంపకోయ్ : రాస్తాను!"

"ఈ మానవుడు అప్పటికి బతికివుంటాడా?"

- కలుక్కుమంది.

"చూడవోయ్ ! వారంరోజులు !"

"సై ?"

అవునన్నట్లు హుషారు యీలవేశాను: కత్తెర మార్కులు చెరోటీ ముట్టించాక. పొగ వలయాలుగా, వదలుతూ, విలయాలుగా తిరుగుతూన్న పొగను చూస్తూ- యింత రసపిచ్చి ఐతే- యితనికెట్లా ? అనుకున్నాను. ఆనాటకొస్తే నాకు లేదూ రసపిచ్చి...! కలకత్తాలో తాను చూచిన రష్యన్ నాటకాన్ని వర్ణించాడు వర్ణించాడూ కొట్టికోలాహలం చేస్తూన్నాడు: కలకత్తా అనే టప్పటికే మరోలోకంలో వున్నట్టు భావించే నేను చెవులు దోరబెట్టుకు వింటున్నాను. వాళ్ల ఆర్కెస్ట్రా, ఫైరీమ్యూజిక్, వొకటేమిటే—నాకు హుషార్ పోస్తున్నాడు !

-నేను చూచిన క్రూసైడ్స్‌లో,ముందు చూచిన- (విన్న,) జ్వాలాసంగీతాన్ని (Firy music) తలుచుకుంటూ రసరాజ్యడోలలో వూగుతున్నాను. గ్రాండ్ హోటల్, లాస్ట్‌డేస్ ఆఫ్ పాంపే; కెప్టన్ బ్లడ్ : అన్నీ గుర్తుకు తెస్తున్నాడు !

బానిసలకు డాక్టర్ బ్లడ్ మందులు వెయ్యడం గుర్తు కొచ్చింది ! ఏడుపొస్తోంది... తెలీకుండానే -

"హైఁ దునియామేఁ పాప గులామీ,

జిస్ మే జీవన హైరోనా!"

అన్నానుట. నాకు తెలీకుండానే నాముఖ భంగిమలు కనిపెడుతూండాలి మరి ప్రసాదరావు !

ఆర్యుల అధికారమదం, అనార్యులబాధ; అనార్యకన్య ప్రేమాజ్వల్యం : అందులో కూడా వినయం.

'బాగబా అరజీ సునో

దో హుకుం ఆరామ్‌లేనే-!"

అని చేసినవినతీ - అన్నీ గుర్తుకొచ్చె ! నాకు పిచ్చి మొహం పడ్డది ! వేళకు అపర్ణ కాఫీ తేకపోతే - ఆకాఫీస్వాదుమరందధారలు నోట్లో పడకపోతే, ఆఫ్లేవర్ మూచూడకపోతే, అది యింత గొంతు తడపక పోతే, యింకా ఏం ఏం పలవరించి; ఏడుస్తూవుండునో...?

-రెండు తొలిగ్రుక్కలు తాగాను.

"చూడవోయ్ ! ప్రహలాదనాటకం..."

"ఊఁ !"

"ప్రహలాదోయ్ !"

"ఎవరూ ?"

"గొడవ ! రాఘవాచారీ కూచిపూడివాళ్లూ !"

"ఓహో ! అదా ! నాకు మహాయిష్టమోయ్: ప్రతేడూ రామకృష్ణశాస్త్రిగారూ నేనూ, నిలువుజీతం కుదుర్చుకుని తెల్లార్లూ చూచివొస్తాం. నిరుడు పిల్ల టూర్‌కూడా వొచ్చాడు :"

"సరే ! అవన్నీ కట్టిపెట్టు — వినేవాళ్లుంటే ప్లేటులా వాగుతావు."

—ఉలిక్కిపడ్డాను. "ఏమి టంటావ్ ?"

"హిఁహిఁ: 'అనార్య- ఆర్య' వివాదంగాగానీ, ధనిక, శ్రామికవర్గ దారుణాలుగాగానీ నీవు ఇంటర్ ప్రెట్ చెయ్యాలి !"

"ఉఁహూఁ !"

"విచిత్రంగా ఘోరంగా వుండాలి !"

"క్లాసిక్సు అవి : మళ్లీ వాటిని మనం నిర్వహించలేమోయి !"

"అందుకే యింటర్ ప్రెటేషన్!"

"ఊఁ ! అను—అను—!"

'ఊహ పోతోంది : దూసుకుపోతోంది : ఆఁ !'

'నెబ్యులాదాకా పోయింది: హిరణ్య-కశిపుడా ?'

'కొడుకు ప్ర-హ్లాదుడా ?' భార్య లీలావతా ?'

'ఏం ఫేర్లోయ్: మహాచక్షగా అమిర్రై...!'

డబ్బుమీద ఆశతో, యజ్ఞాలు చేశేచోట గోధనం వుంటుంది గనుక వాటికోసం పోట్లాడి, వాటిని

హరించి యజ్ఞాలు పాడుచేశేవాడూ ... మతద్వేషం కాదూవాడికి...! Capitalist ... శృంగారి...! యింకేం- పెళ్లాం లీలలు గలదీ ?— అమ్మాయ్యా. వో దమ్ము తీశాను: కుతితీరా యింకోదమ్ము తీశాను: జనానురంజన మా కొడుకుపని-ప్ర-హ్లాదుడా? యింట్లోనే సంఘర్షణా- చండామార్కులు కాదు, చండిమార్కులు. మధ్య సన్యాసులగోల ఎందుకు? — చివరికి-? శ్రీ భూనీశా స్వామి ఐన 'నర-సింహ' స్వామి వొచ్చి, రాజ్యం పగలగొట్టి, ప్రజాపరం-ప్ర-హ్లాదపరంచేస్తాడూ:... భేష్!—

సిజరు పూర్తిగా కాలేటప్పటికి, వూహ చక్కగా వొచ్చింది: యింకోసారి కలబోసి చూసుకుని, ప్రసాద రావుతో ఆవేశంతో చెప్పాను:

"కాగితంమీద పెట్టూ !"

... ... ...

"ఊరుకుంటావేం— కాగితం కలం పుచ్చుకో."

"అప్పుడే?—ఊహ కాస్త మాగవొద్దూ ?"

"ముందు నోట్సుగా రాయవోయ్ !"

ముందు Plan గా తయారు చెయ్యబోతే; కాగితం కలం పుచ్చుకోవొచ్చేసరికి చిలవలు పలవలై, వన్నెలుచిన్నెలుగా తయారైంది.

అంతా చదివి – ప్రసాదరావు,

"ఎన్నాళ్లల్లోగా రాస్తావు?"

"ఎంతోయ్; పదిరోజులు"?

"కాదు, వారంలో రాయాలి."

—వెధవబేరం! అల్లా అంటేనేగాని, నెల్లాళ్లైనా రాయనని.

"సరే లే!"

"సరే లే అన్నావూ—? ఇంకేం - వోరకళ్లు పట్టచ్చు."

"కాదోయ్ బాబూ! సరే - అంటే సరే - రాస్తానుగా."

"నిజం?"

"కర్మభూమి కాదుటోయ్ మంది? మాసోక్క."

"కాదోయ్ -- కభుర్లభూమి!"

—నచ్చుకుంది. నవ్వుతో తప్పించాను.

## ౨

కృష్ణశాస్త్రి రాసిన:

"జయ జయ జయ ప్రియభారత
జనయిత్రీ దివ్యధాత్రి!
జయ జయ జయ శతసహస్ర
నరనారీహృదయనేత్రి?

పాట పూర్తికాగానే—ముందు తెర తీశారు.

మెరుపుదీపాలు జిగ్ జిగ్ మంటూంటే - మెడ నింపిన పూలదండల ఘుమఘుమల్లోంచి, నక్కిదారాల గరగరల్లోంచి, ఈ గిరజాల హిరణ్యకశిపుడు లీలావతిని చూస్తూ మీసపుకొనల్లో నవ్వుతూండడమూ, చూచాను.

'అన్నంలోకి బంగారు రేకులు లే!' అని దర్జాలో ప్రేమలో, మాధుర్యంతో అనడమూ విన్నాను.

—నిన్నటిదాకా కిల్లీల కొట్టుబాకీలు తీర్చలేక భోశకవిన్నె,దారులు తప్పిస్తూ తిరిగిన నేను, నేడు నాటకం రాయడం, దాన్ని వెంటనే -- ఆడడం, నేను నానాటకాన్ని చూస్తూవుండడమూ ... మహాకవి పాల్ (పినపాలవారి అబ్బాయి : యితణ్ణి మేం మహాకవి పాల్ అంటాం ఎక్కరింతకి) నామీద పద్యాలు రాయడమూ, (ఎవరో వొహడు రాయాలిగామరి!) ఏంచెప్పనూ ,వొళ్లు తెలీటంలేదు వైజాగునుంచి శ్రీ.శ్రీ. మద్రాసు నుంచి రామకృష్ణశాస్త్రిగారూ రాలేదే అన్నకించ తప్పిస్తే... అంతా సలక్షణంగా వుంది; తత్తర బిత్తరతో హంగామాతో చూస్తూన్నాను.

... ... ...

ప్రహ్లాదుడు అరాచకం పురిగొల్పుతున్నాడని దండనాయకుకు ప్రభువు ఆజ్ఞప్రకారం బాహా చితకా కొట్టిస్తాడు ! ఊరిలోఉన్న జనమంతా, స్పృహావున్న ప్రహ్లాదుణ్ణి చేతులమీద మోసుకొని - తల్లి యింటిదగ్గరకు తీసికెళ్లబోతారు. స్పృహ కొంచెం తెలిసి ప్రహ్లాదుడు అక్కడికి పోనంటాడు: ఎల్లాగయినా మాతృమూర్తి లీలావతికి తెలుస్తుంది....

హిరణ్యకశిపుడు కళ తప్పి,లోలో మండే సుండేను ధైర్యంతో అదుముకుంటూ వొస్తాడు!: లీలావతి ఎదురు

వెళ్లి - తీసుకొస్తుంది: హిరణ్య తప్పు చేసినట్లూ - లీల ఎక్కి తీస్తున్నట్లూ భావిస్తూవుంటారు.

... ... ...

మాతృమూర్తి గనుక పిల్లవాణ్ణి వెనకేసుకుని, మొగుడితో పోట్లాడుతోంది:

హిరణ్యకు నవ్వొస్తోంది. కాని అది పిశాచపు నవ్వు...లోలో కుములుతూన్నా, బింకానికి పైకి అనడు.

లీలావతి—ఏమండీ! వెధవరాజ్యం పోతే ఏం- మా నాయ్న బతికుంటే చాలు...ఎక్కడున్నా కన్న కడుపును యిట్లా అష్టకష్టాలూ పెడతారా-?

హిరణ్య—(మాట్లాడ్డు.)

"నే చూళ్లేను బాబూ— ఈ నిష్ఠూరం ఎక్కడన్నావుందా—?."

"హిర— (మాట్లాడ్డు.)

"లీలా—నే మాళ్లేను. (నిట్టూర్చి) నుయ్యో గొయ్యో చూసుకుంటాను" (ఏడుస్తుంది...)

ఆణదాని, అంగులోనూ భార్య కన్నీళ్లు చూశాడు హిరణ్య. అతనికూడా ఏడుపొస్తోంది:

"వోసేయి! ఇటు చూడూ—"

లీల చూడబోతుంది. కళ్లల్లో నీళ్లు అడ్డమొస్తై.

"ఛీ, ఏడుస్తావు! పిచ్చిదానా! ఏమే - అబ్బాయి మీద ప్రేమ లేకనా - వాడి మొండిపట్టుదల పోయి ఎప్పుడు బుద్ధి వొస్తుందో అనిగానీ-".

లీల: ఏముందమ్మా! లేక లేక వొక్క నలుసు. వాణ్ణి గాచి రంపానబెట్టి, వాడినెత్తురుతో బొట్టెట్టుకోవాలంటారు మీరు. (ఎక్కెక్కి మాట్లాడలేక పోతుంది.)

హిరణ్య: (కళ్లల్లో నీళ్లు తిరుగుతూండగా)— హుఁ! వాడిమీదపడ్డ వొక్కొక్క దెబ్బ-యివుగో! యీ నాహృదయంమీద వాతల్లాగు వేసుకుంటున్నానే: వెధవబింకానికి - పైకి ఏడవటంలేదుగానీ -, (ఆవురుమంటాడు.)

... ... ...

—నాకళ్లంబడీ నీళ్లు వొస్తున్నై.

నా గుండెలమీద కొట్టినట్లు హాలు రేకులు గర్జిస్తున్నాయ్! ఏమిటీ రసభంగం!

హాలుటిం రేకులు మళ్లీ ఏడుస్తున్నై: బైట పెద్ద గోలా అల్లరినీ— నేను బయటకు పోయాను: వో పెద్ద గాంగ్ హాలుమీద రాళ్లేస్తున్నారు!

—పోలీసులు అదమాయించ చూస్తున్నారు: వెళ్లి యధార్థం కనుక్కుందామని, పోలీసుల్ని ఆపి నేనే వెళ్లి వాకబుచేశాను. అచ్చాఫీసుల్లో పనిచేశే వాళ్లూ, వాళ్లూ, అంతా కార్మికులు టికెట్లు కొనుక్కోడానికి లేదు: లోపలికి రానీరు. నాటకం చూడాలనివుందీ:, పాపం...అన్నంకోసమేకాక రసం కోసం పోట్లాడుతున్నారు! ఏం చేసేదీ — నాజేబూలోంచి వో రెండురూపాయలు తీశి- నలుగురికి టిక్కెట్లు కొనిపెట్టాను! లోపలి కెళ్లాను—మళ్లీ గోల!

నాటకం ఎంతమజాగానో వుండే పట్టుల్లో, రాళ్లేసి అల్లరి చేస్తున్నారు: ప్రేమ కసిగా మారింది వాళ్లకు: మేం అనుభవించని రసాన్ని, మానవులందరికీ సమానమైన హక్కుభుక్తాల్లో వుండాలిసినరసాన్ని, డబ్బెట్టి కొనుక్కుని, అందరాని మానిపండ్లు చేస్తున్నారే అనే అక్కుస్సుతో హాలుమీద వాళ్లు రాళ్లేస్తున్నారు! నాయనా! వెయ్యొద్దు అని బతిమాలుకుందామని మళ్లీ బైట కెళ్లాను: వాళ్లు వొక్కటేముక్క!

—మమ్మల్ని లోపలికి పోనీండి!

—నాటకం మానేజర్‌ను వెళ్లి అడిగాను...!

వీల్లేదన్నాడు! అలగాజనానికి రసానుభవం ఏమిటన్నాడు? నిజమే! నిజమే ఏమిటీ నాపిండాకుడు...వారివారి మనస్సు అంతరువుల్లోంచి వాళ్లువాళ్లు గ్రహిస్తారు! టికెట్టుకొన్న అందరూ రసగ్రహణపారీణులా ఏమిటి-? కళ్లమబ్బులు విడిపోయినై: వెళ్లి మళ్లీ అడిగాను: కనికరించమన్నాను: వీల్లేదన్నాడు మానేజరు. లోపల నాకో నరకం పెకిలుతుని పగిలి రగులు కొంటోంది: మా నాగేంద్రరావు వొచ్చి అన్నాడూ! నిక్షేపంగా నాటకం జరుగుతూంటే - కానివాళ్లకోసం

విచారిస్తావేం-? మేం ఎన్ని నాటకాలాడాం! పోలీసులు సర్దేస్తారులే అని: నాకు దారుణ మనిపించింది!....

—నాటకం వొదిలాను. హాలు వొదిలాను. స్నేహితులమాటలు వొదిలాను. స్నేహితుల్ని వొదిలాను. నాగేంద్రరావునీ వినిపించుకో లేదు: లాఠీచేతులు ఎగదీసి గేటుయివతలి కొచ్చాను: కార్మికులు అక్కస్సుతో హాలమీద రాళ్లేస్తున్నారు: నేనూ కలిశాను!... రాళ్లు కసికొద్దీ హాలుమీద వేస్తున్నాను.

సబిన స్పెక్టరు వొచ్చాడు! చూచాడు. నేను!! ఇందాక పూలదండ వేసి చప్పట్లు కొట్టి మెచ్చుకున్న వీళ్లే — నన్ను చూచి బెదురుతూన్నారు!

లెఖ్ఖలేకుండా రాళ్లేస్తున్నాను!

దగ్గిర కొచ్చాడు సబినస్పెక్టరు:

"శాస్త్రిగారూ!"

"ఏం"

—రాయి తీసుకుంటున్నాను:

సబి— నామాట వినండి! గౌరవంగల మీరు చెయ్యాదగ్గపని కాదు; మీనాటకానికి మీరా విఘాతం కలిగించేది?

"వీళ్లనుకూడా చూణ్ణివ్వండి!"

"లోకం అంతా వొక్కటి చెయ్యగలరుటండీ!"

'తనయందు నిఖిలభూతములందు సమదృష్టి'గుర్తు కొచ్చింది: ఊరుకున్నాను: ఏమీ జవాబు చెప్పలేదు.

"మర్యాదకాదు; లోపలికి రండి! వృథాఆవేశం...!"

అని సర్దుతున్నాడు:

నాకు తిక్క రేగింది! రాయి హాలురేకులమీద విసర చూస్తున్నాను:

"శాస్త్రిగారూ!"

"మీరు మానకపోతే - మిమ్మల్ని ఈరాత్రికి స్టేషనుకు తీసుకెళ్లాలిసొస్తుంది!"

"తయారు!"

సబినస్పెక్టరూ, సర్కిలూ, మనస్సులో ఇదవుతూనే- నన్నూ, నా అనుచరులనీ - స్టేషనుకు తీసికెళ్లారు!—

— మిగిలినరాత్రి గచ్చురాళ్లమీద మట్టుదాని లాగు గడపాలిసొచ్చింది!.

—ఆలోచిస్తున్నాను: పాలుపోటం లేదు. ప్రాబ్లెం సాల్వ్వకావటం లేదు! పానీ వోకున్నైకైనా పట్టటంలేదు! గజిబిజిగా వుంది!

"ఆర్తత్రాణపరాయణ స్స భగవాన్నారాయణో మే గతిః!" శ్రీరంగం, గుడీ గుర్తుకొచ్చాయి: గుడి: నిర్మాణం ఎంత చక్కగా వుంది...ఒహోహో అదా!

'శిల్పాన్నీ- కళల్నీ కేంద్రీకరించి- మతం పేరుతో మాయచేసి దేవాలయం అన్నారూ?,—

అన్నికళలకూ, పరమావధి దేవుడే నన్నారూ?

ఇహపరాలకు రెంటికీ, దేవాలయం కూడలి అన్నారూ.—

అందుకేనా— అంత శిల్పసముజ్జ్వలంగా గుడులు కట్టడం, గుళ్లో పాఠశాలలు పెట్టడం; ఉత్సవాలు జరపటం...ఉత్సవాల్లో నాటకాలు ఆడడం...అంతా బహిరంగంగానే కదూ?. ఇష్టమున్నవాడల్లా తృప్తి పట్టానికి!...

చిక్కు విడిపోయింది; ప్రాబ్లెం సాల్వ్వఅయింది: యిహ అన్నిరసాలూ, వారివారి తాహతునుబట్టి సమన్వయపడేటట్టుగా చెయ్యటానికి కంకణం కట్టుకున్నాను. గిడుగు రామమూర్తిపంతులవాడుకభాషావాదానికి యిదా కీలకం-? రామమూర్తిపంతులుగారూ! ఆశీర్వదించండి!...

... ... ...

—బైటపడ్డాను.

మా నాగేంద్రరావూ ప్రసాదరావూ వొచ్చి చెప్పిచూచారు: నాటకం మాంచి ఎఫెక్టుయిచ్చిందిట:--

యింకోసారి ఆడతామన్నారు ... తెరలకూ, వాటికీ—(అన్నీకొత్త పంపేణీవి: ఇందుకోసం తయారు చేశాం;) ఖర్చైన రెండొందలూ పూడుతై అన్నారు:

నాటకం బహిరంగంగా వేయమన్నాను: వాళ్లు వీలు లే దన్నారు!

ఎంచేత వీలు లేదూ ?— వీలుంది !

ఉలవపాడులో వుత్సవాలు చేస్తారు. మిత్రులు శ్రీ వెంకటకృష్ణారెడ్డి ధర్మకర్త. ఉత్సవాలకు రావల సిందని రాశాడు: వోయిరనై రోజులు ముందుగా ఈ పత్రంతో తయారైనాను.

వెంకటకృష్ణారెడ్డి శ్రోత్రియంజారు...

ఐనా—

ఈనా విప్లవనాటకాన్ని విని- మన్నించి-...

ఉత్సవాలకు దీన్ని ఆడించ ప్రయత్నంచేశారు...

కాని అంత తొందరలో వీలు చిక్క- లేదు...

కాని—

"ఆ ప్రహ్లాదనాటకమే ఆసారి ఆడించారు!...

"ఆ పందిట్లో—

"రాజు వెడల రవితేజము వెడలగ" అని వంత పాటగాడు అంటూంటే—తాళాలు చెవుల్లో మోగు తూంటే — రాజువేషగాడు కత్తి సహస్ర ముఖా లుగా, సహస్రకిరణాలుగా తిప్పుతూన్నాడు!....

---


# మీ నాలుకకు లంచము ఈయవలదు

సామాన్యపు ఇంగువల రకములు పట్టి రుచికొఱకే తయారుచేయబడినవి. వాటి వాడుకవలన ఆరోగ్యమునకు ఆహారమునకు ఎట్టి ప్రయోజనమును ఉండదు. జిహ్వకు లంచముయిచ్చి ఊరుకో బెట్టుట మంచిపనియా ? బుద్ధిమంతులు తమ ఆహారపదార్థములను కొనునప్పుడు జాగ్రత్తగా నుందురు. వారు శాస్త్రీయముగా తయారు చేయబడిన

# "టి. టి." మిస్రా యింగువనే

అంగీకరింతురు. టి. టి. యింగువను మాత్రమే కొని, వాడి, కొనియాడుదురు. ఎందుచేతనంటే వారెరుగుదురు:—ఇది 16 సంవత్సరముల పరిశోధనఫలితముగా తయారుచేయబడిన పరిపూర్ణమగు పదార్థమనుట యదార్థమని.

శాస్త్రీయమగు "టి. టి." యింగువలో రసాయనిక పదార్థములు యిమిడియున్నవి (22. 20% లోహము). ఇంతేకాక సువాసనయు, సురుచియు నిండియున్నవి.

ఈ యింగువ చేర్చిన వంటలు చాలా రుచిగా నుండును. బాగుగా తినగలము.

# జీర్ణ శక్తిని సులభముచేయును

